# భగ్నవీణ-ప్రణయగీతి



శ్రీనందుల

కొందరిని పేరెట్టిపిలిచినా, 'ఏమండీ' అన్నా ఎబ్బెట్టుగా ఉంటుంది. అందుకే ఆయన్ని ఆప్యాయంగా "మాష్టారూ" అని పిలుస్తాను.

అసలు మా పరిచయం పార్కులో పుష్ప సౌరభాల మధ్య జరిగింది. నే నా వూరికి ట్రాన్సఫరై వచ్చాను.

సాయంత్రం ఐదు గంటలకు ఎక్కడున్నా నాకు పార్కుకి చేరే అలవాటుంది. అలాగే రోజూ పార్కుకు వెళుతున్నాను. అది నా దినచర్యలలో ఒకటై పోయింది.

వారం తిరిగేప్పటికి నాలాంటిదే మరో ఒంటరిప్రాణి కనిపించింది. అతను మారుమూల బెంచీమీద కూర్చుని శూన్యంలోకి చూస్తూండే వాడు. అరవై ఏళ్ళు పైబడే వుంటాయి.

నేనూ ఆ బెంచీమీదే కూర్చో సాగాను. రాజ్యాన్నాక్రమించిన శత్రురాజువంక చూసినట్లు చూసే వాడు నా వంక. పట్టించుకోకుండా కూర్చునేవాణ్ణి. మెల్లిగా మాటలు కలిపాను. "ఊఁ, ఆఁ" అనికూడా అనేవాడు కాదు. రాజకీయాలూ, ఆఫీసు కబుర్లూ, పుకార్లు ఆయనను ఆకట్టలేకపోయాయి.

"ఏం మనిషిరా బాబూ!" అని పించేది.

ఒకరోజు మాటల సందర్భంలో "మా హెడ్ క్లర్కు కొడుకు ప్రేమతో బొప్పకట్టి పిచ్చివా డయ్యా"డని చెప్పాను. నిశ్చల తటాకంలో రాయి విసిరినట్లయింది. ఆయన ఆత్రుతతో వివరాలు అడిగాడు. దానితో ఆయన తత్వం తెలిసి, రోజూ ప్రేమ పురాణాలు - నావి, నా స్నేహితులవి కల్పించి చెప్పేవాడిని. ఏకాగ్రతతో వినేవాడు. క్రమంగా మా స్నేహం బలపడింది. ఒకరోజు సాహసించి అడిగాను.

"మాష్టారూ! మీకీ ప్రేమ కథల పిచ్చేమిటండీ" అని.

"నేనూ ఆ జాతి వాడినేనోయ్"

నాకు మతిపోయింది. ఈ పండు ముసలివాడికి ప్రేమ పిచ్చా! ఆయన కనుగుణంగా తాళంవేస్తూ "మీకింకా పెండ్లి కాలేదా మాష్టారూ?" అని అడిగాను.

"కాకపోవడమేమిటి? లక్షణంగా ముప్పై ఏళ్ళు కాపురం చేశాను. పిల్లలందరూ పెద్దవాళ్ళయి. సుఖంగా కాపురం చేసుకొంటున్నారు. మా ఆవిడ కన్నుమూసి నాలుగేళ్ళయింది."

"అన్నీ అనుభవించాక మళ్ళీ ఈ వికారమేమిటండీ?"

"పిచ్చోడా! ప్రేమకూ, వయస్సుకూ సంబంధం లేదు. ఆ దివ్యానుభూతికి అందరూ అర్హులే."

నేను అవాక్కయ్యాను.

నిజంగా ఈయనకు పిచ్చిపట్టింది! తందానా అంటూ గుట్టంతా లాగా లనిపించింది.

"బాగుంది మాష్టారూ! అయితే ఆమె వయసెంత? పేరేమిటి?"

"బాబూ! ప్రేమలో పడ్డవాడు అందం, వయస్సు గురించి ఆలోచించడు. "తా వలచింది రంభ" అని ఊరికే అన్నారా? ఇక పేరులో ఏముంది? అందుకే నేనామెను 'సుందరి' అంటాను."

"ఆమెకు మీ ప్రేమసంగతి తెలుసా?"

"ప్రేమ విద్యుత్ లాంటిదోయ్. అవతలి మనిషి హృదయానికి షాకిస్తుంది. అందుకే అప్పుడప్పుడు సుందరి నాకేసి కన్నెత్తిచూస్తోంది."

"ఇంకేం మీ ప్రేమ ఫలితానికి వస్తోందన్నమాటే."

"వాళ్లంత తేలిగ్గా దగ్గరకు రారు. మన ఆరాధనతో వాళ్లని కరిగించాలి. అదే నా ప్రయత్నం."

పాపం ముసలాడు పూర్తిగా మైకంలో పడ్డాడనిపించింది. తరువాత నాలుగు రోజులదాకా ఆయన దర్శనం కాలేదు.

అయిదో రోజు పెరిగిన గడ్డంతో, పీక్కుపోయిన ముఖంతో దర్శనమిచ్చాడు.

నన్ను చూడగానే మెరిసే కళ్ళతో "బాబూ! మా సుందరి గుమ్మం దాకా వచ్చి నన్నుచూసి చిరునవ్వు నవ్వి వెళ్ళిపోయింది."

మనిషి జ్వరపడి లేచినట్లున్నాడు. అయినా ఇదే ధ్యాస? ఆ మాటే అడిగాను.

"నీ కింకా ప్రేమతత్వం తెలీదు. జబ్బు గిబ్బు ప్రియురాలు చిరునవ్వుచిందిస్తే ఎగిరిపోతాయి."

"ఓ మాటయినా మాట్లాడిందా."

"అబ్బే! అందాకా రాలేదింకా వ్యవహారం."

రోజూ తన ప్రేయసి చిరునవ్వులూ, వగలూ, హొయలూ వర్ణించి చెబుతూనే ఉన్నారాయన!

ఆ రోజు మాష్టారు రాలేదు. ఒంటరిగా బెంచీమీద కూర్చొని ఆలోచిస్తున్నా. ఒక పెద్దమనిషి.... సుమారు ముప్పైఅయిదు సంవత్సరాలుంటాయి— నమస్కరిస్తూ

"మీరేనా! కాశీనాథ్!" అన్నారు.

"అవునండి"

"మా నాన్నగారికి జ్వరం. రాలేకపోయారు. మీరు ఆయన గురించి ఆదుర్దాపడతారని నన్ను పంపారు."

"మీరు మాష్టారి పెద్దబ్బాయా?"

"అవునండి."

"ఏమిటి సుస్తీ మాష్టారికి?"

"జ్వరం. ఏమిటో ఆయన సంగతి మా కెవరికీ అర్థం కాదు. మా అమ్మగారు పోయాక ఇలా తయారయ్యారు. పిల్లలం మేమంతా సుఖంగా ఉన్నాం. మాలో ఎవరి దగ్గరయినా ఉంటూ 'కృష్ణా! రామా!' అనుకో మంటే వినరు. ఇక్కడే ఒక్కరూ తిప్పలు పడతారు. అదేమిటో జ్వరంలో ఈ రోజు పలవరిస్తు న్నారు కూడా. 'సుందరీ! నిన్నే ఆరాధిస్తున్నాను. కరుణించు' అంటూ.

"అవును, నాతోనూ చెప్పారు. ఎవరో సుందరిని ప్రేమిస్తున్నా నని."

"ఏమిటీ! కాటికి కాళ్ళు చాచు కున్న ఆయనకు ప్రేమ ఒకటి తక్కువయిందా?"

"ఆయన ధోరణి చూస్తే ఎవరినో ప్రేమించినట్లే ఉంది."

"మీరునమ్మారంటే, ముసలాడు ఏదో ఎత్తులో ఉన్నాడన్న మాటే! ఆయనకు నిజంగా పిచ్చెక్కింది! ఎవరు ప్రేమిస్తారు యీ పండు ముసలాణ్ణి? ఎవరో వగలాడి ఉన్న ఆస్తి అంతా లాగడానికి ఎత్తు వేస్తోందన్న మాట. అంతా ఆయన స్వార్జితం. ఈయన్ని మైకంలో పడేసి ఆస్తంతా రాయించేసు కొంటుంది కాబోలు. ఇలాగే ఊరు కుంటే కొంపలు మునిగిపోతాయి. ఆయనకి మతి సరిగ్గా లేదని, ఏం రాసినా చెల్లదని, కోర్టులో అర్జీ పడేస్తాం. లేకుంటే లక్షరూపాయల ఆస్తి అదెవ్వతో గద్దలా తన్నుకు పోతుంది. వస్తా." అంటూ విసురుగా వెళ్ళిపోయాడాయన.

మరో వారం గడిచింది. నీరసంగా నడుస్తూ మాష్టారు పార్కుకు వచ్చారా రోజు.

నన్ను చూడగానే "ఏమయ్యా! ఏదో మంచివాడవని నా గుట్టు నీ చెవి నేస్తే మా వాడికి చెప్తావా! ఇదా నీవు చేసిన నిర్వాకం." అన్నారు కోపంతో.

"క్షమించండి మాష్టారూ! మీరు ఏదో కలవరిస్తున్నారంటే నోరు జారాను. పైగా మీ రీ విషయం రహస్యంగా ఉంచారని నాకేం తెలుసు?"

"నిజమేలే! మా పెద్దాడు ఎంత రభస జరిపాడను కొన్నావు? తను సంపాదించిన ఆస్తి నే నేదో తగలేస్తున్నట్లు వాగాడు. కోర్టు కెడతాడట, చూడు బాబూ! పెద్దవాళ్ళయ్యాక పిల్లలు అనుబంధాన్ని తండ్రి ఇచ్చే ఆస్తితో కొలుస్తారు. అదే నా కసహ్యం. వయస్సు మీరి

నంత మాత్రాన ప్రేమించే హృదయం ఉండకూడదా?"

నేనేం మాట్లాడను? సమాజ సూత్రాలకి ఎదురీదే యీయన తత్వం ఎవరు అర్థం చేసుకొంటారు! అందుకే మాట మార్చి "మాష్టారూ! ఏమీ అనుకోకుంటే నాదో చిన్న కోరిక."

"చెప్పు బాబూ!"

"మిమ్మల్నింతగా ఆకట్టుకున్న ఆ సుందరిని ఒక్క మారు చూడాలని ఉంది."

"వద్దు బాబూ! సమయం వచ్చినప్పుడు నేనే చూపిస్తా. అందాకా ఊహించుకోవడంలోనే ఉంది ఆనందం."

"పోనీ ఒక్కసారి మీ ఇంటికి వస్తా."

"ఇప్పుడు కాదు. నా సుందరి గృహ ప్రవేశం చేసేటప్పుడు నిన్ను తప్పక పిలుస్తాను."

మరో పదిరోజులు గడిచాయి. మాష్టారు కోలుకొంటున్నారు. కానీ ముఖంలో నిరాశ, నిస్పృహ అలుముకుంటున్నాయి. సుందరి గురించి మాట్లాడటం తగ్గించారు. ఈ మార్పు నాకు అర్థం కాలేదు.

"బాబూ! దేన్నీ వెఱ్ఱిగా ఆరాధించకూడదోయ్!"

"ఏం జరిగిందండీ?"

"నేనెంత అరాధించినా సుందరి చిరునవ్వులు మాత్రమే చిందిస్తూంది. అడుగు ముందుకు వేయటం లేదు."

నాలో చిలిపితనం చోటు చేసుకొంది. "మాష్టారూ! మొండి ఘటాన్ని మొండితనంతో జయించాలి! మీ ప్రేమ అంగీకరించే దాకా నిరాహార దీక్ష చేయండి."

"అది బలవంతం చేయడం కాదా?"

"ఈ రోజుల్లో లంచాలు పట్టే వారిని సస్పెండు చేసినా సమ్మెలు, సత్యాగ్రహాలు జరుగుతున్నాయి. చిన్న చిన్న సమస్యలపై నిరాహార శిబిరాలు వీథివీథికీ వెలుస్తున్నాయి. మరి మీ పవిత్ర ప్రణయ దేవతని ప్రసన్నం చేసుకోడానికి చేస్తే తప్పేముందండీ."

"నిజమే. ఆలోచిస్తానోయ్." అంటూ లేచారాయన.

నా మంత్రం ఆ వెర్రి ముసలివాడి మీద పనిచేస్తున్నదని సంతోషించా!

నాలుగు రోజులాయన దర్శనం కాలేదు. "కొంపదీసి నిజంగా నిరాహార దీక్ష సాగిస్తున్నాడా ఏమిటి?" అన్న ఆందోళన బయలుదేరింది. చూసొద్దామంటే ఇల్లు తెలియదు. ఆ మరునాడు సాయంత్రం ఆందోళనతో కూర్చున్నాను పార్కులో.

పదిహేనేళ్ల కుర్రవాడు వచ్చి "మీరేనా కాశీనాథ్" అన్నాడు. "అవు"నన్నాను. "మాష్టారికి ప్రమాదంగా ఉంది. మిమ్మల్ని తీసుకురమ్మనిచెప్పారు" అన్నాడు. నా గుండె చెరువయింది. నా చిలిపి సలహా ఆయన అంతానికి దారి తీసిందా? బరువెక్కిన మనసుతో బయలుదేరాను.

విశాలమయిన పెరటిలో చిన్న అందమయిన కుటీరం. చుట్టూ పూల మొక్కలు, ఈ మధ్య సంరక్షణ లేక వెలవెల పోతున్నాయి. హాలులో మంచంమీద పడుకొన్నారు మాష్టారు. ఊపిరి భారంగా వస్తోంది. తెలివిగానే వున్నారు. అంతిమ ఘడియలు సమీపించినా ఆనందం, తృప్తి ముఖంలో ప్రతిఫలిస్తున్నాయి. నన్ను చూడగానే కూర్చోమంటూ కుర్చీ చూపించారు. వచ్చే కన్నీరు నాపుకొంటూ పూడుకుపోయిన గొంతుకతో "మాష్టారూ" అన్నాను.

"బాబూ! బాధపడతావెందుకు, సంతోషించక? నీ సలహా అమోఘంగా పనిచేసింది, నా ప్రేయసి కరుణించింది. కొంచెంసేపటిలో ఆమె కౌగిలిలో కరిగిపోతాను."

నేను తెల్లబోయాను! నోటి వెంట మాట రాలేదు, నా అవస్థ చూపి మాష్టారు "బాబూ! ఈ పండుముసలాడు ప్రేమలో పడ్డాడంటే నమ్మి, నువ్వు మోసపోయావు, నాకు తెలుసు, నన్నొక వెర్రివాని క్రింద జమకట్టావని. జీవితం కాచి వడపోసి, కష్ట సుఖాలు జీర్ణించుకొని, వయసూ, మనసూ పండిన నేను ప్రేమ పిచ్చిలో పడ్డాననుకొన్న నీవూ, మా వాడూ వెఱ్ఱివాళ్లు!"

"మరి సుందరీ.... ప్రేమా...."

"బాబూ! ఇంకా అర్థంకాలేదా? నా ప్రేమసుందరెవరో! నేనారాధించి, నిండుమనసుతో ఆహ్వానించింది "మృత్యువు"- సుందరంటే అపోహపడ్డావు. ఆమె నన్నింతకాలం ఊరిస్తూ దగ్గరగా వచ్చి తప్పించుకుపోయేది. నీవు నన్నాట పట్టించాలని ఇచ్చిన సలహా ఆలోచన రేకెత్తించింది. బలవంతంగా చావును వరించడం పాపమనే ఊహను ప్రక్కకునెట్టి, నీ సలహా పాటించాను బాబూ! నీతో ఏదో అనుబంధం పెరిగింది. నా అంత్యక్రియలు నీ చేతిమీదుగా జరిపించు. సుఖంగా జీవించు బాబూ!" అంటూ నన్నాశీర్వదించిన చేయి వాలిపోయింది.

ఆ విరాగికి అంజలి ఘటిస్తూ కన్నీరు కార్చాను. *